# అదృష్టం

చీకటి పడబోతూంది.

సంధ్య క్రమంగా వెళ్లిపోతూంది. వీధి దీపాలు ఒకటీ ఒకటీ వెలుగుతున్నాయి, కాంతిహీనంగా. నక్షత్రా లింకా రాలేదు.

ఆ చిన్న ఇంటి చిన్న గార్డెన్‌లోని చిన్న మొక్కల రంగు రంగుల పువ్వులన్నీ ఒక్క రంగులోకే వస్తున్నాయి.

ఆ ఇంటిలో దీపం పెట్టలే దింకా.

అక్కడికి కనిపించే అన్ని ఇళ్ళలోనూ పెట్టలేదు. కాని, ఆమె కివేవీ కనిపించడంలేదు.

రాజ్యం పెరటి మెట్లమీద కూర్చుని, మోకాళ్ళమీద తల పెట్టుకుని కళ్లు మూసుకుని, ఏడుపుని దిగమింగే ప్రయత్నంలో ఉంది. అందుచేతనే ఆమె కింక ఏ విషయంమీదా ధ్యాస లేదు.

గంట క్రితంనించి రాజ్యం అక్కడ కూర్చుంది. గంట నించి కొద్ది నిమిషాల క్రిందటిదాకా ఏడుస్తూనే ఉంది. ఏడుపు అలసటతో కొంత ఆగింది. దాన్ని పూర్తిగా అదుపులోపెట్టే ప్రయత్నం చేస్తూంది రాజ్యం.

దుఃఖం అప్పటికన్నా హెచ్చుగా ఉంది. దానినీ అదుపులో పెట్టే ఆలోచన రాలేదామెకి.

కష్టంతో లేచి నిలబడి చుట్టూ చూసింది రాజ్యం. చీకటిలో కూడా ఇల్లు శుభ్రంగా, అమర్చి ఉండి కనిపిస్తూంది.

వీధి గుమ్మందాకా వచ్చి రోడ్డువైపు చూసింది. అతనింకా రాలేదు, ఎందుకనో!

కొంతసేపు— చాలాసేపు అతను రాకుండా ఉంటే బాగుండును.

బాధ, అవమానం... తగ్గేదాకా.

కాని, దానికి ఎంతకాలమూ చాలదు!

కనీసం, ఈ దుఃఖం తగ్గేదాకా...

కనీసం, అది కళ్ళలోనించి పోయేదాకా...

శర్మ ఇదంతా చూస్తే తనకి అవమానం అని కాదు. ఇంత జరిగాక ఇంక అనుమానం ఏమిటి? కాని, శర్మ తన బాధనీ, ఈ అవమానాన్నీ చూసి బాధపడతాడని.

తనకి శర్మ సర్వస్వమూను... అతను తన అదృష్టం.

అతనిమీది ఆలోచనలు ఆమెకి ఉపశమనం ఇచ్చేలోపునే మళ్లా సాయంత్రం జరిగినదంతా ఆమెకి జ్ఞాపకం వచ్చింది, ఆపలేకుండా.

రాజ్యం మూడు గంటలకి నిద్ర లేచేసరికి ఆమెకి ఏమీ తోచలేదు. శర్మ ఆరుదాటాక కాని రాడు. ఇంట్లో తానొక్క తేని.

చదువుకునే పుస్తకాలు లేవు. లైబ్రరీకి పోదామన్నా ఈ రోజు సెలవు. అదీకాక ఎవరితోనైనా కొంచెంసేపు సరదాగా మాట్లాడుతూ గడపాలని చాలా కోరికగా ఉంది. ఆయనకి తన మీద ఎంత ఆప్యాయత ఉన్నా, స్నేహితులుకూడా కావాలి గదా! అదీకాక ఉదయం పదికి వెళ్లిన మనిషి ఆయన మళ్ళీ రాత్రి ఎనిమిదికో, పదికో రావడం. ఒంటరితనం చాలా బాధగా ఉంది.

ఈ ఊళ్లో వసంత తప్ప తనకి స్నేహితులు ఎవరున్నారని? ఎప్పుడైనా వచ్చి మాట్లాడినా, తాను వెళ్ళినా వసంత తప్ప ఇంకెవరు?

అందుకని తా నక్కడికి బయలుదేరింది—— ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని, అప్పుడు వసంత ఇచ్చిన పుస్తకాలు పట్టుకుని, ఇంటికి తాళంవేసి నాలుగున్నరకి బయలుదేరింది. రిక్షా ఎక్కితే తొందరగా చేరవచ్చునని.

రాజ్యం ఆ పైన జరిగినదానిని మళ్లీ జ్ఞాపకం తెచ్చుకోలేకపోయింది.

ఆమె లేచి ఇంట్లో దీపం వేసింది.

ఈ సరికి చుట్టూ దీపాలు వెలుగుతున్నాయి.

బాగా చీకటి పడింది.

ఇంట్లో దీపం వెలిగించినా చీకటిగానే ఉంది.

'ఆయన వస్తే బాగుండును' అనుకుంది రాజ్యం.

వెనువెంటనే 'ఆయన వస్తే ఎలాగ? ఏమని చెప్పను?' అని బాధపడింది. దహించుకుపోతూన్న గుండెలు ఆయనతో చెప్పుకుంటే కొంచెమైనా ఉపశమిస్తాయని ఆశ; ఆయన వస్తే ఇదంతా ఆయన కెలాగ చెప్పడమని బాధ.

అంతకన్నా పెద్దబాధ... తనకింక స్నేహితులే లేరు.

ఈ ఊరు వచ్చినకొత్తలో అలాగే ఉండేది. తన కెవ్వరూ తెలిసినవాళ్లు ఉండేవారుకాదు. కాని, ముందర అది ఒక బాధగా అనిపించేది కాదు. ఆయనని సాగనంపడంలో ఉదయాలూ, ఆయనకోసం ఎదురు చూడడంలో సాయంత్రాలూ గడిచి పోయేవి. జీవితంలో మొట్టమొదటిసారి తనని ప్రేమించేవాళ్లూ, తాను ప్రేమించేవాళ్లూ దొరికిన ఆనందంలో ఇంకే వెలితీ తెలిసేది కాదు.

ఎడారిలో నడిచి నడిచి ఉన్న మనిషికి చల్లని నీడ దొరికితే, వెనువెంటనే కొత్త కోరికలు పుట్టుకునిరావు.

అప్పటికి తన బ్రతుకూ అలాంటిదే అనుకుంది రాజ్యం. అప్పుడూ ఇలాగే కన్నీళ్లు నిత్యమూ వచ్చేవి. ఇలాగే ఇంట్లో కూర్చుని సంధ్యలకి అశ్రుతర్పణాలూ, తనలో తాను కుమిలి పోవడమూను.

కాకపోతే ఆ ఇల్లు తనదికాదు. ఇలాగా నిశ్శబ్దంలో తన చేత తానే కన్నీళ్లు పెట్టించుకోనక్కరలేదు— అమ్మ ఆ పని చేయించేది.

అమ్మ...

అలాగ తాను పిలిచేదేకాని, ఆమె తనని కనిన మనిషి కాదని క్షణక్షణమూ జ్ఞప్తికి వస్తూనే ఉండేది. తనకు వయసు వచ్చినకొద్దీ ఆప్యాయతా, మమతా కావలసి వచ్చినకొద్దీ, ఆమె తనకి దూరం అవుతూ వచ్చింది. తన తల్లి ముఖంకూడా రాజ్యానికి తెలీదు. పురిటిలోనే ఆమె వెళ్ళిపోయింది. నెల తిరగకుండా నాన్న రెండోపెళ్ళి— తనని పెంచడంకోసం— చేసుకున్నాడు.

ఎందుకనో, అమ్మకి తా నంటే ఇష్టం ఉండేదికాదు.

నాన్నకి తన ధ్యాస లేనేలేదు. ఆయన ఉన్నా, లేక పోయినా అమ్మ ఒక్కలాగే ప్రవర్తించేది.

తనకి అవమానంకన్నా బాధ. అప్పుడు తెలిసేదికాదు— వెనక్కి చూసుకుంటే ప్రేమకోసం వాచిపోయి ఉన్న హృదయ బాధ అని తెలుస్తుంది కాని, అప్పుడు ఏదో తెలియని ఆవేదనగా ఉండేది. అమ్మ చీదరించుకున్నా, ఉండే ఉంటే ఏదో కారణం చూసి చేయిచేసుకున్నా అంత బాధగా ఉండేదికాదు. ఆమె ఎప్పుడూ ఒక్కమాట ఆప్యాయంగా అనకపోవడం మాత్రం బాధగా ఉండేది.

తాను బ్రతికి ఉన్నా, చచ్చినా నాన్నకి తేడా ఉంటుం దని అనిపించలేదు రాజ్యానికి. బహుశా అదీకాదు. తాను బ్రతికి ఉండకపోతే అయనికి కొంత నయంగా ఉండేదేమో!

మొత్తంమీద తాను వాళ్లిద్దరికీ విషతుల్యంగానే ఉండి పోయింది. విచిత్రం ఏమిటంటే, నాన్న ఉదాసీనతకన్నా,

అమ్మ ఉదాసీనతే తనని ఎక్కువ బాధపెట్టింది. దానికి కారణం రాజ్యానికి బోధపడలేదు.

పి. యు. సి. దాకా చదువెలాగో ఈడ్చుకొని వచ్చేసరికి తనకి చాలా కష్టం అయింది. నాన్నకీ, అమ్మకీ సంతానం లేదు— తరవాతి ఉదంతం జరిగి ఉండకపోతే తన చదువు సాగివుండును. అది తన కిష్టంలేదు అప్పుడు. తనకి తెలివితేటలు లేవనికాదు. తరుచుగా మంచిమార్కులే వచ్చేవి. కాని, మన శ్శాంతి లేక క్లాసులో చెప్పేది వినిపించకా, వినిపించినా తల కెక్కకా క్రమంగా చదువంటే అసహ్యం కలిగింది. పి.యు.సి. రాశాక తన అశాంతి తారస్థాయికి వచ్చింది.

ఆ సమయంలో శంకర్ తటస్థపడ్డాడు.

అతన్నిగురించి ఆలోచించాలనీ, అ సంఘటన లన్నిటినీ జ్ఞాపకం తెచ్చుకోవాలనీ అనిపించలేదు రాజ్యానికి. కాని, ఈ రాత్రి, ఈ ఒంటరితనం, మనస్సులోనించి జ్ఞాపకాల్లోకి రాకుండా దాచుకోవడానికి ప్రయత్నిస్తున్న సాయంత్రపు ఉదంతం— అన్నీ ఆమెకి ఈ జ్ఞాపకాన్ని అడ్డగించేశక్తి నివ్వలేదు. ఆ రోజూ ఇలాగే తాను ఒంటరిగా ఇంట్లో కూర్చుంది. ఇలాగే అప్పుడే చీకటిపడింది — తానూ ఇలాగే ఆలోచనల్లో సతమత మౌతూన్నది.

శంకర్ లోపలికి రావడం తాను చూడనేలేదు—అప్పటికి అత నెవరోకూడా తనకి తెలీదు.

కాని, అతనికి తెలుసు.

"ఒంటరిగా కూర్చున్నావా, రాజ్యం?" అన్నాడు, వచ్చి తన కెదురుగా నిలబడుతూ.

తెల్లబోయి చూసింది తాను.

"అవున్లే, నే నెవరో నీకు తెలీదు..." అని, తా నెవరో చెప్పాడు. అమ్మకి దూరపు చుట్టం. ఈ మధ్యనే ఈ ఊరుకు వచ్చాడు.

ఆ తరవాత...

అవన్నీ కెరటాల్లాంటి జ్ఞాపకాలు.

అవి కాలకూట విషంలాంటి ఫలితాని ఇచ్చినా, ఆనాటి బాధల మధ్యనించి ఈ నాటి కళ్ళతో చూసుకుంటే, వాటిలోని మాధుర్యం పూర్తిగా మరుగైపోదు.

శంకర్ తనని కొత్తమనిషిగా చేశాడు.

తనకి కొత్త అనుభూతి ఇచ్చాడు.

అతనికి తాను కావాలి— తనకోసం అతను తహతహ లాడేవాడు. ఆ నిజం అప్పుడు తన హృదయాన్ని మేఘాలలోకి తీసుకెళ్లేది. అక్కడ నాట్యం చేయించేసి.

కొద్దికాలమే కాని, తాను జీవితంలోని మాధుర్యం చవి చూడగలిగింది. కలలోనే అయినా, తన బ్రతుకులోని సౌందర్య రాహిత్యాన్నీ, వికృతరూపాలనీ మరచిపోగలిగింది.

అప్పటిదాకా తనని వేధించిన అమ్మ ఉదాసీనత ఆ రోజుల్లో తనకి అదృష్టంలాగ కనిపించేది. ఆమెకి తెలియకుండా

ఎక్కడ తిరిగినా ఆమె పట్టించుకునేదికాదు. ఎలాగో, ఎందుకో శంకర్‌తో ఉండగా ఆమె చూడడం ప్రమాదమని తాను అనుకుని, శంకర్ చెప్పేదంతా చాలా రహస్యంగా ఉంచడం ఈ పరిస్థితులనిబట్టి చాలా కష్టం కాలేదు.

ఆ రోజులు తలుచుకుంటే ఇప్పుడూ బాగుంటుంది!

శంకర్ ఎంత ఒత్తిడిచేసినా, తాను తమ మధ్య అత్యవసరమైన ఒక హద్దూ ఉంచగలిగింది... బహుశా శంకర్ తన పూర్తి బలంతో ఒత్తిడిచేసి ఉండకపోవడాన్ని మిగిలినవి ఏ నిజాలైనా, అతనికి తనమీద నిజమైన ప్రేమ కొంచమైనా ఉండి ఉండాలి! అప్పుడు జరిగినదంతా కేవలం మోసం అనిపించేటప్పుడల్లా రాజ్యం ఈ ఆలోచనతో గడిచిపోయిన ఆ రోజులకి కొంత సౌందర్యం ఆపాదిస్తూ ఉంటుంది.

కొంతసేపటినించి ఆమె కళ్లు పొడిగా ఉన్నాయి. లేచి ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకుని, చిందరవందరగా ఉన్న జుత్తుని సరిచేసుకుని కుర్చీలో కూర్చుంది రాజ్యం. ఈ నాటి ఒంటరితనం ఎంత వద్దన్నా మరొకరోజు జ్ఞాపకం తెస్తూంది—అదీ ఇలాటి ఒంటరిరోజే!

అ నాడు ఎందుకో తాను శంకర్‌ని కలుసుకునేందుకు బయటికి పోలేకపోయింది రాజ్యం. తన కీ నాడు జ్ఞాపకం ఉన్నది. తాను వెళ్ళకపోవడమూ, ఒంటరిగా ఇంట్లో కూర్చుని శంకర్‌నిగురించి కలలు కనడమూను. ఎంత తహతహలాడింది తాను!

గంటసేపు—— క్షణం ఒక యుగం అంటే ఏమిటో తెలుసుకుంటూ గడిపాక హఠాత్తుగా తన ఎదుట శంకర్!

ఆ క్షణం తాను పరవశమైపోయింది.

ఆ పారవశ్యం ఇప్పటికి జ్ఞాపకం ఉంది——స్పష్టంగా.

ఆ మరుక్షణాలలో జరిగినవీ అంత స్పష్టంగానూ జ్ఞాపకం ఉన్నాయి.

శంకర్ చేతుల్లో తాను.

కళ్లు నిప్పులుగక్కుతూ అమ్మ...

శంకర్ ఒక్కసారి తననివదిలి, త్వరత్వరగా పాలిపోవడం —అన్నీ జ్ఞాపకం.

అమ్మ అన్నమాటలు...

తా నప్పటికీ పూర్తిగా ఓడిపోలేదు. తను చేసినది తప్పు కాదు... శంకర్ తనని పెళ్లి చేసుకుంటాడు...

ఎలాగ నవ్వింది అమ్మ!

ఎంత వికృతంగా ఆ అట్టహాసం చేసింది!

"పెళ్ళి!" అంది అమ్మ. హాస్యంలేని పూర్తి అపహాస్యపు నవ్వు నవ్వుతూ.

"అవును!" అంది, కరిగిపోతూన్న ధైర్యాన్ని కూడ గట్టుకునే ప్రయత్నంచేస్తూ తాను,

"వాళ్లావిడా, వాడి పిల్లలూ, వాడు ఉంచుకున్నదీ— వాళ్ళంతా ఎలా ఒప్పుకుంటారే ?" అంది అమ్మ కర్కశంగా. 'పెళ్ళి!' అంటూ ఆమె మళ్లీ అంత వికృతంగానూ నవ్వింది.

ఒళ్లు స్వాధీనం తప్పినట్లయింది రాజ్యానికి.

ఆ తరవాత అమ్మ మాటలు వినిపించలేదు.

వినిపించనక్కర లేదు. వాటిని వినకుండానే బాధ పడంది. కొట్టిందని కాదు. అది కొత్త ఏమీ కాదు. కాని, తాను హత్య కన్నా అధికమయిన నేరం ఏదో చేసినట్టు అందరు తనని ఎంత నీచంగా చూశారు!

తాను చెప్పిన దేదీ ఎవరూ విననూ లేదు.

ఇన్నాళ్లూ తానేమయినా పట్టించుకోని ఎందరో హఠాత్తుగా తనని గురించి ఆసక్తి చూపసాగారు.

వాళ్ల ప్రశ్నలు!

ఈ నాడూ ఆవెగటు పోలేదు రాజ్యానికి.

ఆ తరవాత ఒక సంవత్సరం నరకం అంటే ఏమిటో తెలిసింది తనకి. ఆత్మహత్య తప్ప, మరేమీ శరణ్యం లేదనిపించింది.

తన 'కథ' అందరికీ తెలిసిపోయింది.

అమ్మకి ఆ సంవత్సరం నోటికి కావలసినంత పని—ఎవరడిగినా, అడక్కపోయినా,

ఆ రోజుల్లో ఆత్మహత్య చేసుకోకుండా ఎలాగ ఆగగలిగింది తాను?

బహుశా, మరి కొంతకాలం ఆ పరిస్థితులు అలాగే సాగితే, తన జీవితంలోకి శర్మ వచ్చి ఉండకపోతే, బహుశా తాను ఓడిపోయి ఉండేది.

కాని, శర్మ తన జీవితంలోకి వచ్చాడు.

ముందర అతను నాన్నతో పనిమీద తమ ఇంటికి వచ్చేవాడు. తాను చాలా రోజుల వరకూ అతన్ని చూడనే లేదు.

కాని, అతను తనని కనిపెట్టిచూడడం తాను గమనించింది. దెబ్బలు తిని తిని ఉండడాన్ని మళ్లీ ఏ మగవాడితోనూ తాను మాటలాడదలుచుకోలేదు. దూరంగా ఉండేది.

అతను క్రమంగా మరీ తరుచుగా వచ్చేవాడు.

చాలా సార్లు ఇంట్లో అమ్మా నాన్నా లేనప్పుడు అతను రావడం, తాను ఎదురు పడడం తప్పలేదు.

అప్పుడు అతను పలకరించేవాడు.

ఆ పలకరింపులో నిండు హృదయం, అనురాగం తనకి వ్యక్తమయేవి.

కాని, తన అనుభవం జ్ఞప్తికి వచ్చి తాను కుంచించుకుపోయేది. అతని నుంచి పారిపోయేది. తన హృదయంలో క్రమంగా అతను చోటు చేసుకున్నాడు. అతనంటే ఎంతో

విశ్వాసం, అభిమానం కలిగింది. కానీ, అతనికి తాను దగ్గర అవలేక పోయింది.

తనకి భయం. అనుమానం...

చివరికి ఒకనాడు శర్మ తనని ఒంటరిగా ఉన్నప్పుడు పలకరించి, తాను పోబోతూంటే చేతులు పట్టుకుని ఆపి, "రాజ్యం! ఎందుకని అలాగ పారిపోతావు?" అన్నాడు.

తన చేతుల కోసం పెనగులాడుతూ, "నన్ను వదిలేండి..." అంది రాజ్యం.

"పారిపోనని మాట ఇస్తే..."

"పారిపోను."

అతను వెంటనే తన చేతులు వదిలేశాడు.

"ఒక్కటి అడుగుతాను. జవాబు చెప్పాలి!"

తాను తల పంకించింది.

"నేనంటే నీ కిష్టమేనా?"

రాజ్యం ఏమీ జవాబివ్వలేదు. హఠాత్తుగా ఆమె పూర్తిగా అశక్త అయిపోయింది.

"నిజం చెప్పు..."

"..."

"నాకు నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది."

రాజ్యం తన ఎత్తి చూసింది. అతను చాలా సిన్సియర్‌గా అడుగుతున్నాడు.

అతని కెన్నో చెప్పాలనిపించింది.

అతని మాట లెన్నో వినాలనిపించింది.

కాని, మాట రాలేదు.

తన పరిస్థితి తలుచుకుని కన్నీరూ ఆగలేదు.

చివరికి ఏమీ అనకుండానే తాను వెళ్లిపోయింది. తన కన్నీటిని అతను చూశాడో, లేదో తెలీదు.

ఆ విషయం అంతటితో ఆగనూ లేదు.

నాలుగు రోజులు పోయాక శర్మ నాన్నతోనూ, అమ్మతోనూ మాట్లాడాడు. తానూ విన్నది.

కాలవిలంబనం లేకుండా, తనని గురించిన 'నిజం' అతనికి చెప్పేసింది అమ్మ. జరిగినదానికి వేసిన రంగుల అలంక రణలు అమ్మకి కొత్తగా లేవు.

"బాగుపడవలసిన వాడివి... మాకు కావలసిన వాడివి. దాన్ని చేసుకుని సుఖపడవు" అంది అమ్మ.

శర్మ కొన్ని ప్రశ్నలు వేశాడు— తన 'కథ' గురించి.

అన్నిటికీ అమ్మసమాధానాలు చెప్పింది —ఆ సమా ధానాలలో ఒక్కొక్క మాట తన శరీరం మీద ఒక్కొక్క మేకు దిగ గొట్టినట్టుంది.

చివరికి అతను; "అయినా సరే. నేను చేసుకుంటాను" అనగానే అమ్మ ఆశ్చర్యపడినట్టు క్షణం ఆగి, మేము ఒప్పుకోము!" అంది.

నవ్వుతూ, "ఏం?" అన్నాడు శర్మ.

"అందరూ ఏమంటారు? మోసగించి పిల్ల నిచ్చామన్న అపఖ్యాతి వద్దు మాకు!" అంది అమ్మ.

ఆ తరవాత అతను రావడం తగ్గింది.

వారం పోయాక కనిపించి, "మీ వాళ్లతో మాట్లాడాను, రాజ్యం!" అన్నాడు శర్మ.

"అంతా విన్నాను" అంది తాను.

"గుడ్. నా మీద నమ్మకం ఉందా?" అన్నాడు శర్మ.

తెల్లబోయి చూసింది తాను.

"నేను వచ్చే వారం ముహూర్తం పెట్టించాను. నాకు మా అన్నా, వదినా తప్ప లేరు— వాళ్లు ఇష్టపడ్డారు. సింపుల్‌గా పెళ్లి అయిపోతుంది. నువ్వు నాతో వస్తావా?"

"నేను..." తన మాటలు తడబడ్డాయి.

"నువ్వు దొంగతనంగా రావద్దు... చెప్పిరా..."

ఆ క్షణంలో శర్మ పది అడుగుల ఎత్తు మనిషిగా కనిపించాడు. ఒక్కసారి రాజ్యం కొత్త మనిషి అయింది.

"కాని— అన్నీ విని మీరు నన్ను ఎందుకు పెళ్లి చేసుకుంటున్నారు?" అని అడిగింది.

"నాకు లోకం తెలుసు గనుక...నీమీద నమ్మకం ఉంది గనక..."

రాజ్యం ఆలోచించింది.

అప్పటి జీవితంకన్నా ఏదైనా నయమే! ఆమె త్వరగా నిశ్చయించుకుని, "మీతో—ఇప్పుడే వస్తాను" అంది.

"గుడ్!" అన్నాడు శర్మ.

అయిదు నిమిషాల్లో రాజ్యం చిన్న సూట్ కేస్‌లో రెండు జతల బట్టలు పడేసుకుని గుమ్మంలోకి వచ్చి, అక్కడ నిలబడి ఉన్న అమ్మని చూసి ఆగింది.

"ఎక్కడికే?" అంది అమ్మ గద్దిస్తూ.

"అతనితో" అంది ధైర్యంగా తాను.

శర్మ తన దగ్గిరికి వచ్చి, సూట్ కేస్ తీసుకుని గదిలో పెట్టి వచ్చి, "వాళ్ళవి నీకేమీ వద్దు...రా!" అన్నాడు.

అమ్మ ఏదో అరుస్తూంది.

తాను శర్మ వెనక వెళ్ళిపోయింది.

ఆ మరుసటి వారంలో పెళ్ళి అయింది—పదిమందికన్న లేరక్కడ. అమ్మ లేదు నాన్న లేడు.

ఆ తరవాత శర్మకి ఊరు బదిలీ అయింది. కొత్తలో అన్నీ ఎంతో సంతృప్తికరంగా ఉన్నా, క్రమంగా ఎవ్వరూ స్నేహితులు లేరనే అసంతృప్తి ఎక్కువ కాసాగింది.

ఎవరితోనైనా స్నేహం చేసుకోవాలంటే భయం...ఈ ఊరిలోనూ తన చరిత్ర తెలిసి ఉంటే. తనతో స్నేహం చెయ్యరు.

సాహసించి ప్రయత్నించే ధైర్యం లేదు. తన ఊరిలో అందరూ తనని వెలివేశారు "లేచిపోయింది" అని తనని అనడం తనకి తెలుసు.

అందుకే శర్మ ఇక్కడికి బదిలీ చేయించుకున్నాడు. అతను చెప్పకపోయినా. తనకోసం అతను ఉన్న ఊరు విడిచి రావడం ఆమె ఏ క్షణంలోనూ విస్మరించదు. తనకోసం అతనే త్యాగమైనా చేస్తాడు।

వసంత శర్మ స్నేహితుడి చెల్లెలు—పరిచయం అయాక తనకి అంత ఒంటరితనం లేదు. ఎందుకో వసంత మొదటిసారి కలవగానే స్వంత చెల్లెల్లాగ దగ్గరికి వచ్చేసింది. అన్నపూర్ణ—ఆ స్నేహితుడి భార్య—ఆ మాట రెండు మూడు సార్లు అన్నది కూడాను.

అలాంటి అన్నపూర్ణ ఈ సాయంత్రం తాను వెళ్ళేసరికి తలుపు సగం తీసి, "రాజ్యంగారూ! మమ్మల్ని క్షమించి మీ రిక్కడికి రావడం మానెయ్యాలి!" అంది.

దిగ్భ్రాంతితో, "అన్నపూర్ణా!" అంది రాజ్యం.

"వసంత పెళ్ళి కావలసిన పిల్ల... మీరు దయచేసి మళ్ళీ ఇక్కడికి రాకండి!" అంది తలుపు వేస్తూ. వసంత ఆమె వెన కాలే ఉన్నా, ఒక్కమాట ఆడలేదు.

నీరసంగా వెనక్కి తిరిగి వచ్చింది ఎలాగో. ఇంట్లో అడుగు పెట్టగానే అంతసేపు ఆపుకున్న దుఃఖం ఒక్కసారి బయటికి వచ్చింది.

జరిగిన దేమిటో తనకు తెలుసు...తన 'కథ' వాళ్ళకి తెలిసిపోయింది! అందుకే అంత హఠాత్తుగా, వసంత క్షేమం కోసం తనని దూరంగా ఉంచారు.

కుర్చీలో కూర్చున్న రాజ్యం లేచి వీధిలోకి చూసింది-శర్మ మరి ఆలస్యంగా వస్తున్నా డీ మధ్య. ఆఫీసులో పని ఎక్కువగా ఉందట!

అయినా తొమ్మిదయి పోతూంది.

అతను పది గంటలకు వచ్చాడు.

అతన్ని చూడగానే రాజ్యానికి ఒక్కసారి దుఃఖం వచ్చింది. అతన్ని పెనవేసుకుని జరిగినదంతా దుఃఖస్వరంతో చెప్పింది. "పీక తీసినట్టయిందండీ!" అని వాపోయింది. పది నిమిషాలు పట్టిం దంతాచెప్పడానికి.

ఆమెని మంచంమీద కూర్చోపెట్టి "ఏడవకు రాజ్యం!-మనుషులంతా అలాగేలే!" అన్నాడు శర్మ.

ఆమె దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేసింది.

"మన కీ ఊరు వద్దులే...మరో ఊరు వెళ్ళిపోదాం!"

"నిజంగా?" అంది, ఆత్రంతో రాజ్యం.

"నిజంగా!" అన్నాడు శర్మ.

ఆమె లేచి అతన్ని కౌగలించుకొని ఆనందబాష్పాలూ, అశ్రువులూ కలిపి అతనికి అభిషేకం చేసింది.

అతను వారించాడు, ఆమెని దూరంగా కూర్చోపెట్టి మాట్లాడాడు.

ఆమె మరీ దగ్గరగా వచ్చినప్పుడూ, చేతులు తనమీద వేసినప్పుడూ అతని ఒంటిమీద బాగా తగిలిన దెబ్బలు నొప్పి పెడుతున్నాయి. సాయంత్రం వసంతని తప్పుగా అర్థంచేసుకుని చొరవ తీసుకున్నాక జరిగిన రభసతో ఒళ్ళంతా హూనం అయి ఉంది శర్మకి.

ప్రత్యేకం తనని రెండు గంటలకి రమ్మని, ఆ సమయానికి అన్ననీ, అతనితో మరిద్దరినీ ఇంట్లో పెట్టేంత మోసం వసంతలో ఉందని అతని కేం తెలుసు ? ఒళ్లు హూనంచేశారు వాళ్లు.

అదంతా ఒక బాధ...వసంత దక్కలేదే అని అంత కన్నా బాధ.

"మీరు...మీరు...మనుషులు కాదండీ!" అంటూంది కృతజ్ఞతతో, రాజ్యం.

లేవబోతూన్న ఆమెని వారిస్తూ, "కాదు...కాదు..." అని గొణిగాడు శర్మ. ఈమె తన అదృష్టంకొద్దీ దొరికింది... ఆమెకి కృతజ్ఞతలో ఇం కేమీ కనిపించవు అనుకున్నాడు శర్మ. మరీ బాధగా ఉన్న ఒక దెబ్బమీద తేలిగ్గా వేలితో రాసుకుంటూ, దెబ్బలని గురించి ఆమెకి ఏం చెప్పాలని అతను ఆలోచన చెయ్యసాగాడు.